అంటే కేవలం ఇక్కడే ఈ పోలిక, ఎక్కువ తక్కువ తేడాలు ఆమెకు లేదన్న గుర్తింపు లక్ష్మిలో కలిగాయన్నమాట.

అందుకు కారణం ఏమిటి? బహుశా తనిచ్చే స్వేచ్ఛ కావచ్చు. ఓ

# ఆడం అండ్ ఈవ్

## మత్తి భానుమూర్తి



రాజయ్య చెప్పింది విని అచేతనురాలై నిలబడిపోయింది పుష్ప.

ఆమె అలా ఆశ్చర్యపోతుందని ముందే ఊహించిన రాజయ్య వినయంగాను, బిడియంగాను చూడసాగాడు. హఠాత్తుగా అడిగింది "ఇలా ఎంత కాలంగా ప్రవర్తిస్తోంది?"

"ఈ మజ్జకాలంగానే నండమ్మగోరూ... మునుపు ఈ బుద్దులు లేవండి... ఓ నెల నుంచి కావొచ్చండి. అంతకు మునుపు మేవిద్దరం సిలకాగోరింకల్లా గాకపోయినా బాగానే పేణంగానే వుండేవోళ్ళవండి..." నెమ్మదిగా విపులంగా చెప్పాడు.

పుష్ప వెంటనే తీక్షణంగా ఆలోచించసాగింది. ఆ ఆలోచన ఏదో మంచి సబ్జెక్ట్ గురించి అయినట్టు ఆమె ముఖం ప్రసన్నంగా వుంది. సాధారణంగా ఆ ముఖ కవళికలు ఏ రచయితకో వుంటాయి. రచయిత్రి కాకపోయినా పుష్ప ఆలోచనపరురాలు. జీవితాల్ని, మనుష్యుల్ని నిశితంగా పరిశీలించే అలవాటున్న వ్యక్తి.

"ఇట్టా సెప్పడం మీకు కష్టంగా అనిపిస్తే ఏవీ అనుకోకండమ్మా..." మరుగ్గా అతని వంక చూసింది. వెంటనే తల వంచుకున్నాడు గాని తను చెప్పదలచుకున్నది ఆపలేదు.

"నేను ముందే ఆలోసించానమ్మా... తప్పేమో... పేద్దోరు... దాని బుద్ది కుక్కబుద్ది గాని అమ్మగారిది అయ్యగారిది తప్పేటుంటది అనుకున్నాను గాని దాని వొరస రోజు రోజుకి సిరాగ్గా అనిపిస్తందమ్మ... మరి మీ దయ, మీద, మీ అభిమానం మీద బతుకుతున్నోల్లం... మీకు సెప్పకోక ఎవరికి సెప్పాలి తల్లీ?!... అందుకే సెప్పానమ్మా..." చేతులెత్తి నమస్కరించాడు.

"అబ్బెబ్బే... నేనేం అనుకోను రాజయ్య... పైగా ఇలా నాకు చెప్పినందుకు ఆనందంగా కూడా వుంది. అయితే ఇది నేను ఏమాత్రం ఊహించని విషయం... అందుకే ఆశ్చర్యపోయాను గాని ఇప్పుడు చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంది. డోంట్ వర్రీ. లక్ష్మి విషయం నాకొదిలెయ్..." ఏదో పెద్ద మబ్బు విడిపోయినట్లు కళకళలాడింది రాజయ్య ముఖం.

లేచి నిలబడ్డాడు.

"సాలు... ఆ మాట సాలమ్మ... నాలుగు రోజులుగా ఎంతో మదనపడి మీ కాడ బయటపడ్డాను. నేను కోరుకుంటున్న మాట అన్నారు. సాలు... వత్తానండమ్మ..." కదిలాడు.

"అలాగే... నువ్వు మాత్రం లక్ష్మితో ఎప్పటిలాగే వుండు..." అంది హెచ్చరికగా పుష్ప.

"అట్టాగేనమ్మా... అమ్మ ఈ సంగతి అయ్యగారికి..."

నవ్వింది పుష్ప "చెప్పన్లే" అంది.

ఏమీ అనకుండా ఆనందంగా నవ్వి కదిలాడు. వచ్చేటప్పుడు ఎంత బిడియంగా, భయంగా వచ్చాడో ఇప్పుడంత హాయిగా, తేలికగా వెళుతున్నాడు.

మన సమస్యలకు పరిష్కారం ఆత్మీయులైన వ్యక్తుల మీదికి తోసేస్తే ఇంత హాయిగా వుంటుంది కాబోలు అనుకుంది పుష్ప.

అలా చాలాసేపు సోఫాలోనే కూర్చుండిపోయింది. లక్ష్మి గురించి నింపాదిగా ఆలోచించసాగింది. రాజయ్య చెప్పినదంతా గుర్తు చేసుకుంది.

లక్ష్మి ఈ మధ్య ఇంట్లో నరకం సృష్టిస్తోంది. షోకులు, సరదాలు ఎక్కువయ్యాయి. నేల క్లాసు టికెట్టు కొంటే సినిమాకి రాదు. కాటన్ చీరెలు కట్టనంటోంది. ఐదు నిమిషాలకోసారి పౌడర్ రాసి మేకప్ చేసుకుంటోంది. ఇంట్లో కూడా చెప్పులు లేకుండా నడవడం లేదు. ఫేను కావాలంటోంది. మంచం మీదకి పరుపు కావాలంటోంది. అన్నిటిని మించి సెంటు రాసుకునేవరకు దగ్గరకు రావద్దని రాజయ్యను దూరంగా వుంచుతోంది. వీటన్నిటితో పాటు ఇవి తీరవని తెలియడం వల్ల కాబోలు విపరీతమైన చిరాకు, కోపం, అసహనం... విచిత్రం ఏమిటంటే ఇవన్నీ కేవలం ఒక్క నెల రోజులనుంచే ప్రారంభం కావడం... నెల రోజులనుంచే లక్ష్మి పుష్ప దగ్గర పనిచేస్తోంది. అంతకుముందు నాలుగైదు ఇళ్ళల్లో పనిచేసినప్పుడు లేని ప్రవర్తన ఇప్పుడే మొదలైంది.

అది రాజయ్య వివరించిన సంగతి. అంటే అతని అభిప్రాయంలో లక్ష్మి ప్రవర్తనకు కారణం పుష్ప జీవిత స్థాయి ప్రభావం.

చిన్నగా నవ్వుకుంది పుష్ప.

తనను చూసి లక్ష్మి చెడిపోతోంది.

ఓ ఇంటి పనిమనిషి ఆ ఇంటి ఇల్లాలిని చూసి, తనతో పోల్చుకుని తన తక్కువతనానికి చింతిస్తూ తన సుఖ జీవనాన్ని కల్లోలపరచుకుంటోంది. అసలిది సహజ పరిణామమేనా? ఏ పనిమనిషైనా అలా ఫీలవుతుందా?

తనింట్లో లక్ష్మికి ముందు చాలామంది పనివాళ్ళు మారారు. వాళ్ళెవరూ ఇలా ప్రవర్తించగా వినలేదు. అలాగే లక్ష్మి తనింటికి రాకముందు చాలా ఇళ్ళల్లో పనిచేసింది కాని వారిని చూసి స్పందించి ఆమె జీవితంతో పోల్చుకున్న సూచనలేవీ తనకు కనిపించలేదు.

స్నేహితురాలితో మాట్లాడినంత చనువుగా దగ్గరగా మాట్లాడడం కావచ్చు. ఆమె కష్టసుఖాలను వినడానికి ఆసక్తి చూపడం కావచ్చు. అన్నిటిని మించి ఇంచుమించు ఇద్దరిది ఒకే వయస్సు కావడం కావచ్చు.

ఇక్కడ పనిచేస్తున్నంతసేపు లక్ష్మిలో ఏదో కొత్త ఉత్సాహం, కొత్త ఉత్తేజం ఏర్పడడం పుష్పకి లీలగా గుర్తొచ్చింది. ఇంట్లో పనిచేస్తున్నంతసేపూ పుష్పతో ఏదో ఒకటి చెప్తూనే వుంటుంది. అది కేవలం పనిమనిషి పట్టుకొచ్చే గాసిప్‌లా వుండదు. చక్కగా వినసొంపుగా వుంటాయి. నిజానికి ప్రతి స్త్రీకి చదవడం కంటే వినడం, మాట్లాడడమే ఎక్కువ ఇష్టం. పుష్ప ఎం.ఎ. లిటరేచర్ చదువుకున్నా, ఆమె లక్ష్మి కబుర్లను ఆసక్తితో రిసీవ్ చేసుకునేది. లక్ష్మి కేవలం అంట్లు తోమడం, బట్టలుతకడం లాంటి నిర్దేశించిన పనులు చేసుకుని వెళ్ళిపోయే శాస్త్రప్రకారపు పనిమనిషిలా వుండదు. అలా వుంచలేదు పుష్ప... బెడ్ రూం అని లేదు, కిచెన్ రూం అని లేదు ఎక్కడికైనా, ఎప్పుడైనా లక్ష్మి ప్రవేశించేది. అలాగే కేవలం లక్ష్మి పనిచేయడం, తను కూర్చుని అజమాయిషీ చేయడం అనే ధోరణితో కూడా పుష్ప ప్రవర్తించేది కాదు. లక్ష్మితో పాటు తనూ గొడ్డు చాకిరి చేసేది.

శ్రీనాథ్ ఎప్పుడూ అంటుంటాడు "నువ్వెందుకలా అన్ని పనులు చేస్తావ్ పుష్పా, కావలసినంతమంది పనివాళ్ళని పెట్టుకోవచ్చు కదా"

నవ్వి అంటుంది పుష్ప "ఈ ఇంటిని మీ, నా అభిరుచికి తగ్గట్టు నీట్‌గా వుంచాలంటే ఇంకా ఐదుగురు పనివాళ్ళు కావాలి. అప్పుడు ఇంట్లో పనివాళ్ళే ఎక్కువమంది వుంటారు. మీ సంగతి ఏమో గాని నాకు మాత్రం ఇది అప్పుడు మనిల్లులా వుండదండి. ఇందులో మనమే పనిమనుషుల మనిపిస్తుంది..."

ఎప్పటిలా విస్తుపోయి చూస్తాడు శ్రీనాథ్. ఇంత ఎనలిటికల్‌గా ఏ స్త్రీ ఆలోచించలేదని అతని ఆశ్చర్యం.

పుష్ప పనిచేసి బాగా అలసిపోతే ఎంతో నొచ్చుకుంటాడు శ్రీనాథ్.

"చూడు చేతులెలా కందిపోయాయో... చూడు ఎంత చమట పట్టిందో. చూడు తల ఎంతగా చెదిరిపోయిందో... చూడు ఆ మరకలు... చూడు ఆ చీరెలా మాసిపోయిందో..."

అందులో వినిపించే ఆప్యాయతకు. హాయిగా నవ్వుకుని అంటుంది "భార్య అందంగా, కుందనపు బొమ్మలా వుండాలన్న మీ బూర్జువా మనస్తత్వం మార్చుకోండి సార్... మన దేశంలో కూడా ఏ రష్యాలాగానో, అమెరికాలాగానో ఎదిగిపోవాలంటారుగా మీరు... మరి ఆ రెండు దేశాల్లోనూ పనిమనుషులంటూ మన ఇళ్ళల్లో కనిపించే చాకిరి యంత్రాలుండవు. అమ్మగార్లు, అయ్యగార్లు ఎవరి పని వారే చేసుకుంటారు. ఇప్పుడు మనం చేస్తోందీ అదే..." ఇది పుష్ప మనస్తత్వం. అందుకే ఆమె లక్ష్మిని ఓ స్నేహితురాలిగా పరిగణిస్తుంది.

ఓసారి తల్లి లక్ష్మిని చూసి విస్తుబోయి అంది పుష్పతో "అదేమిటే... పని మనిషిని సొంత మనిషిలా చూస్తున్నావ్?!"

"పని మనిషిని సొంత మనిషిగా చూడడం లేదు, పరాయి మనిషిగా చూడడం లేదు. కేవలం పనిమనిషిగా గౌరవిస్తున్నానంతే... డిగ్నిటీ ఆఫ్ లేబర్... నీకు తెలియదులే" అని నవ్వేసింది.

అలా లక్ష్మిని గౌరవించి ఆదరించడం చెడు ఫలితాన్నిచ్చిందిప్పుడు.

పుష్ప ఆలోచనలు మరింత జటిలమయ్యాయి.

లక్ష్మిని కూడా కేవలం పనికి మాత్రమే నియోగించి తను అజమాయిషీ చేస్తూ, హూంకరిస్తూ, గర్జిస్తూ, కోప్పడుతూ, తిడుతూ, మిగిలినవి పెడుతూ అధికారం చలాయిస్తే లక్ష్మి ఎప్పటిలా భయభక్తులతో పనిచేసి మిగిలినవి తీసుకుపోయి భర్తకు పెడుతూ ఇచ్చిన



డబ్బుతో సుఖ జీవనం చేస్తుండేదేమో... తనే ఆమెకు అందని ద్రాక్షను అందీ అందకుండా అందిస్తూ, ఊరిస్తూ ఇలా తయారుచేసిందా?!

ఇదంతా ఎవరైనా ఓ రచయితకు చెబితే ఓ పనిమనిషి జీవితంతో ఆటలాడిన ఓ ఇంటి మనిషి కథ అంటూ రాసి రాసి చివరికి ఆ పని మనిషి వర్గమంతా ఏకమై ఈ ఇంటి మనుష్యులపై కడలి తరంగాల వలె విరుచుకుపడతారని ముగిస్తాడేమో. ఈసారి గట్టిగానే నవ్వుకుంది పుష్ప.

ఆ ధోరణి తప్ప... కోర్కెల్ని అణచుకున్న తిరుగుబాటు అణగారిపోతుంది. కోర్కెల్ని అర్థం చేసుకున్న తిరుగుబాటు సత్ఫలితాన్నిస్తుంది.

లక్ష్మికి కోర్కెలు, వాటి స్వరూప స్వభావాలు ఎలా వివరించాలో, ఈర్ష్య అసూయల కలితంగా కోర్కెలు తీర్చుకునే పద్ధతినెలా బోధించాలో అర్థం గాక ఆలోచిస్తూ వుండిపోయింది పుష్ప. ఆలోచనలు ఆగలేదు గాని లక్ష్మి వచ్చేసింది.

"ఇదేంటి, ఇలా కాలెండర్‌లో దేవతలాగా వుండిపోయారు?" అంది గట్టిగా లక్ష్మి.

ఉలిక్కిపడి చూసింది పుష్ప.

అదే హుషారు... అదే సరదా... అదే కళకళలాడే ముఖం.

పైట బొడ్డులో దోపింది. వేలితో జుత్తు ముడి వేసింది.

"ఇయ్యాల బూజు దులపడం మొదలెడతాను. సూడండి. ఇల్లంతా పేద్ద గుహలాగుంది... లెగండి లెగండి" చురుగ్గా లోపల కెళ్ళింది లక్ష్మి.

పుష్ప కేవలం అలా చూస్తోంది. అంతే...

ఇక్కడింత హెల్దీగా ప్రవర్తించే లక్ష్మి సొంత ఇంట్లో చిరాకుపడి పోతోందంటే నమ్మాలా వద్దా... భర్తతో ప్రతి మాటకు తగవుకు సిద్ధపడుతోందంటే ఆశ్చర్యపోవాలా వద్దా...

లోపలనుంచి అరచింది లక్ష్మి "అమ్మగారూ... రండి... ఇటుండి" ఆమె కంఠంలో హుషారు ఇల్లంతా ప్రతిధ్వనిస్తోంది.

మెల్లగా లేచి లోపలికెళ్ళింది పుష్ప ... ఆలోచనల వల్ల ముఖం వికృతంగా




వున్నట్లు తనే ఫీలయ్యింది. ఓసారి కళ్ళు మూసి ఆలోచనలు ఆపడానికి యత్నించి నవ్వుతూ అడిగింది ... "ఏమిటి లక్ష్మి?"

బూజు దులుపుతోన్న లక్ష్మి క్షణ కాలం అలా వుండిపోయింది. పుష్పవంక చూస్తూ వెక్కిరిస్తున్నట్లుగా అంది "ఏంటే లక్ష్మి?"- పుష్పకు నవ్వొచ్చి ఫక్కున నవ్వింది. ఇద్దరూ నవ్వారు గట్టిగా.

"ఇయ్యాల ఏంటమ్మ పెదవి కదపడం లేదు ... ముఖం కూడా సిన్మాస్టార్ల ముఖంలా సాగలాగినట్టుంది ... ఏంటి కత?"

మన సమక్షంలో ఎదుటి మనిషి స్వేచ్ఛతో హాయిగా అల్లరి చేస్తోంటే ఎవరికైనా ఆనందంగానే వుంటుంది. ఎప్పుడూ లక్ష్మి మాటలకు పుష్ప అలాంటి ఆనందమే అనుభవిస్తుంటుంది.

చిన్నగా నవ్వింది.

గబుక్కున దగ్గర కొచ్చింది లక్ష్మి.. కొంటెగా అంది "అయ్యగారు కేంపు కెళ్ళారని దిగులొచ్చిందేంటి?" అన్నాక తనే ఫక్కున నవ్వింది.

"దిగులు, బెంగ, జబ్బు ఏవీ లేవు గాని పని చెయ్యి ... కబుర్లపోగు" అంది లోపలికి వెడుతూ పుష్ప.

కాస్త దూరం వెళ్ళనిచ్చి వినిపించేలా అరచింది లక్ష్మి "అయ్యగారు అర్ధరాత్రికైనా తిరిగొచ్చేత్తార్లే.. దిగులెట్టుకోకండి..." ఆ మాటల ప్రభావంతో శ్రీనాథ్ రూపం అతి సామీప్యంలో క్షణ. కాలం కనిపించి మాయమైనట్లు భావించింది పుష్ప.

ఆమెకు అప్పుడు నిజంగానే శ్రీనాథ్‌పై బెంగొచ్చింది.


ఆమెకు తెలియకుండానే ఓ వేడి నిట్టూర్పు వెలువడింది. మనస్సు అతని చుట్టూ పరిభ్రమిస్తుండగా 'టీ' కలిపింది - రెండు కప్పుల్లో పోసింది. ఓ కప్పు లక్ష్మికిచ్చేందుకై ముందు హాలువైపు కదిలింది.

హాలు దగ్గర కొచ్చిందిగాని బూజు దులుపుతున్న శబ్దం వినపడలేదు. ఆశ్చర్యంగా లోపలికి తొంగి చూసి అలా నిలబడిపోయింది.

ఆ విశాలమైన హాలులో శ్రీనాథ్ తండ్రి తైలవర్ణ చిత్రానికి ఎదురుగా పెద్ద అద్ద ముంది. దాని ముందు నిలబడి మదురుపై పడుతున్న తల వెంట్రుకలను అందంగా రింగులు చుట్టడానికి విశ్వయత్నం చేస్తోంది లక్ష్మి.

గతంలో రెండు, మూడుసార్లు లక్ష్మి ఇలా అద్దం ముందు నిలబడి వుండడం పుష్ప చూసింది.

"అద్దం చూశావంటే పిచ్చుకలా




అతుక్కుపోతావేం లక్ష్మి" అని జోక్ చేసింది కూడా.

కానీ, ఈసారి ఎందుకో కాస్త చిరాకు కలిగింది. అయినా లక్ష్మిని ఇంకా పరీక్షించాలనిపించింది. అక్కడే నిలబడి చాటుగా ఆమెను పరిశీలించసాగింది పుష్ప.

చాలా చురుగ్గా ఎంతో నేర్పుగా జుత్తును రింగులుగానూ, విలాసంగానూ మార్చుతోంది లక్ష్మి. కాసేపు అద్దంలో చూసుకుంటోంది ... 'చాలా అందంగా వున్నాను కదూ' అనుకుంటూ నవ్వేసుకుంటోంది. ఓసారి కనురెప్పలు సరిచేసింది. మరోసారి ముక్కు శుభ్రం చేసింది. కాస్త వెనక్కు జరిగి పైట తీసి ఓసారి అద్దంలో తన వక్షస్థలాన్ని తనివితీరా చూసుకుంది. మళ్ళా పైట వేసుకుంది. మడతలుగా వున్న పైటను పలుచగా వేసుకుంది. ఓసారి అద్దంలో చూసుకుంది. మెడ క్రింది భాగం కనిపించేలా పైటను సరిచేసింది. క్రింద చీర కుచ్చిళ్ళను మరింత క్రిందికి లాగింది. బొడ్డు భాగం కనిపించేలా చేసి ఓసారి అద్దంలో చూసుకుంది. చీరెను నడుం దగ్గర సరిచేసింది. నడుం వెంట వున్న శరీర ముడతలు కనిపించే చీరె అంచును మడత పెట్టింది. ఓసారి వెనక భాగాన్ని చూసుకుంది.

ఆమె ముఖంలో ప్రసన్నత పుష్పకు నవ్వు తెప్పించింది. ఎవరికి వారు అందంగా కన్పించకపోతే బ్రతకలేరు సుమా అనుకుంది. తను పిలవకపోతే కొన్ని కాంతి సంవత్సరాలు అలాగే అద్దం దగ్గరే నిలబడగలదనిపించింది.

పైగా 'టీ' చల్లారిపోతోంది. అప్పుడే వస్తున్నట్టుగా పిలిచింది.

"లక్ష్మి ... ఈ హాలు అయిపోయిందా?" లోనికొచ్చి "అదేమిటి - ఇంకా దులపడం అవలేదా?" కాస్త తీక్షణత ధ్వనింపజేసింది.

ఆమె గదిలోకి అడుగుపెట్టేసరికి అలసిపోయి చెమటలు కారుస్తూ తదేకంగా ఇల్లు శుభ్రం చేస్తోన్న ఆదర్శ పనిమనిషి భంగిమలో వుంది లక్ష్మి.

"చాలా కష్టపడిపోతున్నట్టున్నావ్?" అప్రయత్నంగా ఆమె నోటి వెంట వ్యంగ్యం వెలువడింది. అంత వాగుడుకాయ కూడా నోట మాటరాక చిన్నగా నవ్వింది. చీపురు పక్కన పడేసి నేలపైన చతికిలబడింది. పుష్ప సోఫాలో

కూర్చుంది.

కబుర్లు ...

"అయ్యగారు కారు కొంటానన్నా రుగా ... ఎప్పుడు కొంటారమ్మా?"

ఆశ్చర్యపోయింది పుష్ప. ఆమె ఆశ్చ ర్యాన్ని గుర్తించకుండా చెప్పకుపోతోంది లక్ష్మి.

"అవతలింట్లో లేరూ ఎల్ఐసి ఆఫీ సరుగారు .. ఆయన కొన్నారమ్మ .. అదేంటి.. కోతి కారు.." నవ్వొచ్చింది పుష్పకు. పకపకా నవ్వి అంది "కోతి కారు కాదు .. మారుతి కారు"

"ఆ .. అదే అదే" తనూ నవ్వింది.

"కారు సంగతి సరేగాని మీ ఆయన రిక్షా ఎలా వుంది లక్ష్మి .. కొత్త టైర్లు వేయించాలని అయ్యగార్ని డబ్బులడిగాడు కదా ... ఏమైంది ... రిక్షా బావుంటేనే కదా మీ బాగు?"

ఊహించినట్టుగానే ముఖం చిరాగ్గా పెట్టింది లక్ష్మి .. ఉత్సాహం తగ్గి పోయింది.. "ఆ .. ఏదో చేయించాడు.. బాగానే వున్నట్టుంది..మల్లా ఏవీ సణ గడం లేదులే"

చివుక్కుమంది పుష్ప మనస్సు. లక్ష్మి అసలు మనస్తత్వం ఇదేనా? అనిపించింది కూడా. ఇప్పుడే హితబోధ చేసినా చెవికెక్కడం కష్టం. ఇనుమును సాగ దీయాలంటే బాగా కాల్చాలి .. ఆపైన దెబ్బ వెయ్యాలి.

"అలాగా .. ఆ .. లేలే .. దులుపు .. చీకటిపడిపోయింది" అంది హడావిడిగా.


లక్ష్మి గబగబా లేచి తిరిగి చీపురు అందుకొని ఇల్లు దులపసాగింది. మరో చీపురుతో పుష్ప దుమ్మంతా ఊడవ సాగింది.

కాసేపు నిశ్శబ్దం .. పుష్ప తన కబుర్లకు సరిగ్గా స్పందించకపోవడం వల్ల కాబోలు లక్ష్మి మౌనంగా వుంది. పుష్ప అంది మెల్లగా ..

"లక్ష్మి .. నిన్ను రాజయ్య బాగా చూసుకుంటాడా?"

లక్ష్మి వెంటనే అవునంటూ ఏమైనా మధురమైన ఊసులు చెప్పాలని పుష్ప కోరిక. కాని, లక్ష్మి ఆమెను నిరాశ పర చింది. "ఆ బాగానే వుంటున్నాంలే.." ఇంకా ఏదో చెప్పబోయి చెప్పకుండా మెల్లగా రూఫింగ్ దులుపుతోంది.

పుష్ప వదల లేదు "బాగానే ... అంటే నేను, అయ్యగారు వున్నట్టు




వుంటున్నారా?"

చివ్వున తిరిగి చూసింది...మనస్సులో అసంతృప్తి అంతా ముఖంలో కన్పిస్తోంది.

"అట్టా కాదుగాని బాగానే వుం టు న్నాం .. అసలు ... మీకున్నన్ని మాకు వుండవుగా అమ్మా ... మీకంటే పెద్ద ఇల్లు ... పెద్ద కంపెనీ ... సోఫాలు ... పిల్లు ... బట్టలు ... అబ్బో ... శాలా ... అట్టా మాకు లేవుగా ..."

అభిమానాన్ని ప్రకటిస్తున్నట్టు హుందాగా నవ్వింది పుష్ప.

"భార్యాభర్తలు అన్యోన్యంగా వుండ డానికి కార్లు, మేడలు, బట్టలు, నగలు అవసరం లేదు లక్ష్మి. వీటి వల్ల ఆనందం వుంది, గొప్పదనం వుంది. నిజమే, కాని ఓ భార్యాభర్తల మధ్య అనుబంధం ... క్లోజ్‌నెస్ 'ఇంటిమసి' అంటారు ఇంగ్లీ షులో..అది..అది వుండడానికి ఏవీ అక్క ర్లేదు. ఆడం అండ్ ఈవ్ కథ విన్నావా — అంటే ప్రపంచంలో మొట్టమొదటి ఆడా, మగా అన్న మాట. వాళ్ళే తొలి జంట. వాళ్ళకు శరీరాలు, మనస్సు తప్ప కనీసం ఒంటి మీద గుడ్డయినా వుండదు ... సైన్స్, సంస్కృతి ఎలా పోయినా వీటివల్ల మొగుడు, పెళ్ళాల అను బంధంలో తేడా రాకూడదు లక్ష్మి ..."

మనస్సంతా వ్యాపించిన మంచితనపు పరిమళం, సంస్కారపు సౌరభం, ఆత్మీయురాలైన తోటి వ్యక్తి తప్పు ధోరణి ఆలోచనను మార్చాలన్న తాపత్రయం కలిసిన పుష్ప గొంతు ఓ విధమైన ఉద్రే కంతో గమ్మత్తుగా పలికింది.

ఏదో ఆలోచిస్తూ ఒక షెల్ఫ్ దులుపు తోంది లక్ష్మి.


ఎవ్వరూ మాట్లాడలేదు. ఇద్దరి లోనూ ఆలోచనా తీవ్రత.

బుక్‌షెల్ఫ్‌లో బుక్స్ చెదిరి క్రింద పడ్డాయి. ఆ బుక్స్ మధ్య ఎప్పటిదో ఓ చిన్న ఆల్బమ్ క్రిందపడి తెరచుకుంది. పుష్ప తిరిగి చూసింది.

లక్ష్మి చేతిలోకి తీసుకుంది.

తెరచుకున్న పేజీలో ఓ ఫొటో .. శ్రీనాథ్ కుర్రాడిలా వున్నాడు .. రేగిన జుత్తు, మాసిన గెడ్డం, దిగులు చూపులు, కళ్ళలో భయం, బెంగ, చిరిగిన బట్టల్లో దారిద్ర్యం ... ఆ ఫొటో చూసి లక్ష్మి కళ్ళు పెద్దవయ్యాయి.

"ఇదేంటమ్మా .. అయ్యగారు .. అయ్యగారేంటి ఇట్టా వున్నారమ్మా?"




పుష్ప ఆశ్చర్యంగా ఫొటోలోకి చూసింది. మరుక్షణం కళ్ళు మూసి ఏదో స్ఫురించినట్లు కదిలి నవ్వింది "అదా..." అంది ఈజీగా..

లక్ష్మి మరింత ఆశ్చర్యంగా చూస్తోంది.

"అది .. అయ్యగారు ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేసేటప్పటి ఫొటో!"

లక్ష్మిలో పెద్ద విస్ఫోటం ...

చాలా కూల్‌గా చెప్తోంది పుష్ప.

"అయ్యగారు ఈ స్థితికి రావడానికి చాలా కష్టపడ్డారు లక్ష్మి ... చిన్నప్పుడు ఇంటింటికి పేపర్లు వేసేవారు...తర్వాత ఓ ప్రెస్‌లో పనిచేస్తూ రాత్రి చదువుకునే వారు ... తర్వాత ఓ ప్రెస్ పెట్టు కున్నారు. దాంతో పెరిగి ఇప్పుడింత వారయ్యారు"

లక్ష్మి అలాగే నిలబడి వుంది.

పుష్ప దగ్గరకెళ్ళి ఆ ఫొటో ఆల్బం తీసేసుకుని అడిగింది "బూజు పోయి నట్లేనా?"

పోయినట్లు తలూపింది లక్ష్మి.

* * *

మర్నాడు ఉదయం -

వంటింట్లో కాఫీ కలుపుతోంది పుష్ప. ఆమెను తాకుతూ నిలబడి టూరు విశే షాలు చెప్తున్నాడు శ్రీనాథ్.

"అమ్మగారూ .." బయట నుంచి లక్ష్మి పిలుపు వినబడింది.

ఇద్దరూ ముఖాలు చూసుకొని బయట కొచ్చారు. ఎదురుగా లక్ష్మి, రాజయ్య.

ఎవ్వరూ మాట్లాడలేదు. లక్ష్మి రాజయ్య వంక చూసింది అడగమన్నట్లు ... రాజయ్య కాస్త కంగారుపడి సర్దుకొని. అన్నాడు —

"అయ్య .. నేను .. నాకు .. అసలేంటంటే .. నాకు .. మరి .. ఏదో బ్యాంకులో అప్పు ఇత్తారంట .. రిక్షా మానేసి ఆటో నడుపుకుందామని .. మీరు కాస్త చెప్పి - ఆ బ్యాంకు ఆఫీసర్లు తెలుసని .. ఇది .. లచ్చిమి అంటంది .. మరి .."

అందరికి అంతా అర్థమైంది. శ్రీనాథ్ పుష్పవంక చూశాడు అభిమా నంగా.

పుష్ప లక్ష్మి వంక చూస్తోంది తృప్తిగా. తను నాటిన మొక్క పుష్పించిందని తెలిసినప్పటి తృప్తి అది. ◆